క్లుప్తంగా

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని నరసాపురం ఎంఈవో పి.పుష్పరాజ్యం అన్నారు. పట్టణంలోని 1వ వార్డు శ్రీహరిపేట భవిత స్కూల్లో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేక పింఛన్లు అందిస్తోందని చెప్పారు. దిడ్ల ఫైనీ దివ్యాంగులకు ఆట వస్తువులు అందించారు. బి.ఫణికుమార్, కొనగళ్ల కిరణ్‌లు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ, ఉపాధ్యాయులు కె.రమేష్, కడలి శారద, పి.రాధ, పీటీ ఆమోష్ పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్



ట్యాంకర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు, నరసాపురం రోడ్డులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నరసాపురం వైపు వెళుతున్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఓ ప్రైవేటు బస్ ఢీకొట్టింది. సోమవారం పాలకొల్లు నుంచి నరసాపురం రోడ్డులో ఆయిల్ ట్యాంకర్ వెళుతుంది. వెంప నుంచి కొంతేరు ఓ వివాహ వేడుకకు కిరాయికి వచ్చిన ప్రైవేటు బస్ కొంతేరు నుంచి పెళ్లి వారిని వెంప గ్రామానికి తీసుకువెళుతుండగా పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్యాంకర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బస్ ఢీకొట్టినట్లు బస్ డ్రైవర్ తెలిపారు. ఈ ఘటనలో బస్‌లో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయని అన్నారు. పోలీసులు చేరుకుని ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల అందజేత

భీమవరం: చిన అమిరంలోని శ్రీస్వామి యోగేశ్వర నందగిరి విశ్వశాంతి వృద్ధాశ్రమానికి భీమవరం రోటరీ క్లబ్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌వీ ఆర్‌సీ జయవర్మ ఆర్థిక సహకారంతో సోమవారం ఆక్సీమీటర్లు, బిస్కెట్లు, ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేశారు. సాయి దుర్గాప్రసాద్, గుండు కిషోర్ పాల్గొన్నారు.

గొంతువాపు నివారణకు టీకాలు

ఆకివీడు: మండలంలో పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి భార్గవీ సత్య చెప్పారు. సోమవారం అయిభీమవరంలో పశువులకు టీకాలు వేశారు. అన్ని పశువులకు ముందు జాగ్రత్త చర్యలుగా టీకాలు వేయించాలని సూచించారు.

శృంగవృక్షంలో ఎక్స్‌ప్రెస్‌లకు రిక్వెస్ట్ స్టాప్

పాలకోడేరు: భీమవరం నుంచి నడిపే అమలాపురం, నరసాపురం, వైజాగ్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు శృంగవృక్షంలో రిక్వెస్ట్ స్టాప్ ఇస్తామని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీవీఎస్ఎన్ మూర్తి చెప్పారు. సోమవారం శృంగవృక్షం శ్రీవాసవీ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకవన సమారాధనలో డీఎంను ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు అత్యం సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

పూజా రుసుముల పెంపు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో పూజా రుసుములు పెంచుతూ దేవదాయశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి యర్రంశెట్టి భద్రాజీ సోమవారం చెప్పారు. పెరిగిన పూజా రుసుముల వివరాలిలా ఉన్నాయి. సహస్రనామార్చన రూ.50, నిత్యపూజ (నెలకు) రూ.300, నిత్యపూజ (ఏడాదికి) రూ.2వేలు, గరగ ప్రదక్షిణ రూ.50, చీర సమర్పణ రూ.10, వాపసు చీర (కాటన్, వాయిల్, సిల్క్) రూ.20, వాపసు చీర (పట్టుచీర) రూ.100, తులాభారం (అన్నప్రాసన, నామకరణం) రూ.300, చండీ హోమం (ప్రతి అమావాస్య, పౌర్ణమి) రూ.1000, శాశ్వత పూజ రూ. 2,500, కేశఖండన రూ.25, సైకిల్ పూజ రూ.25, వాహన పూజ (ద్విచక్రవాహనం) రూ.100, వాహనపూజ (కారు, లారీ, ఆటో) రూ.200, శ్రీ విఘ్నేశ్వర స్వామి అష్టోత్తర నామార్చన రూ.50, నిత్య పూజ (నెలకు) రూ.300, నిత్యపూజ రూ.2వేలు, శ్రీఅమ్మవారి లడ్డు ప్రసాదం 100 గ్రాములు రూ.20, పులిహోర 150 గ్రాములు రూ.10 చొప్పున పెరిగాయి. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు తెలిపారు

అడుగడుగునా అండగా.. వర్షంలోనూ తోడుగా

- తీరప్రాంత గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన
- అండగా ఉంటామంటూ రైతులకు భరోసా



నరసాపురం: తుపాన్ రక్షణ చర్యలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



నరసాపురం రూరల్: వేములదీవి పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మిచాంగ్ తుపానుగా ఏర్పడి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చెబుతున్నట్టుగానే గత రాత్రి నుంచి వాతావరణంలో మార్పులు ఏర్పడి ఈదురు గాలులతో పాటు వర్షాలు కురుస్తున్నాయి. మిచాంగ్ తుపాను హెచ్చరికలతో జిల్లా స్థాయి అధికారులు మండలంలో పర్యటిస్తున్నారు. కలెక్టర్ ప్రశాంతి ఆదివారం, సోమవారం నియోజకవర్గంలో పర్యటించి అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ నెల 3 నుంచి 8వ తేది వరకూ తుపాను ప్రభావంతో అధికారులంతా అందుబాటులో ఉండాలని మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముందస్తు చర్యగా అధికారులకు కేటాయించి సెలవులు రద్దు చేశామని అధికారులంతా తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పేరుపాలెం, కేపీపాలెం గ్రామాల్లో ఏడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని వృద్ధులు, వికలాంగులు,గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆచంట నియోజకవర్గంలో అధికారులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. సోమవారం పెనుగొండ, ఆచంట మండలంల్లో తహసీల్దార్లు ఎస్ గురుమూర్తి రెడ్డి, సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి పి స్పందన, ఆచంట వ్యవసాయ విస్తరణాధికారి వి నాగరాజు పర్యటించారు. వర్షానికి మునిగిన వరి చేలల్లో నీరు బయటకు పోవడానికి చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పెనుగొండ, ఆచంట మండలాల్లో ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. పెనుగొండలో ఇప్పటికే కోతలు ప్రారంభం కావడంతో ఒక్కరోజులోనే తేమ శాతంకు సంబంధం లేకుండా 800 మెట్రిక్ టనుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లోనే సమీపంలోని రైసుమిల్లులకు తరలించారు. ఆచంట మండలం పరిధిలోని ధాన్యాన్ని సమీపంలోని రైసుమిల్లులకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తీరప్రాంత గ్రామాల్లో పర్యటన



నరసాపురం రూరల్: పెదమైనవానిలంకలో అధికారులతో సమీక్షిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో ఎస్పీ రవిప్రకాష్ తదితరులు

నరసాపురం రూరల్: మిచాంగ్ తుపాన్ హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలలో భాగంగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రశాంతి, చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. నరసాపురం మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో సోమవారం ఉదయం కలెక్టర్, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేపట్టారు. పునరావాస కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది, రెవెన్యూ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అనుక్షణం యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. ఈయన వెంట తహసీల్దార్ ఫాజిల్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, నరసాపురం జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందరరెడ్డి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌తో కలిసి సోమవారం సాయంత్రం బియ్యపుతిప్ప, వేములదీవి, పెదమైనవానిలంక గ్రామాల్లో పర్యటించి తుఫాన్ ఏర్పాట్లను పరిశీలించారు. పెదమైనవానిలంక, వేములదీవి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి అందుతున్న వైద్యసేవలు, భోజన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈదురుగాలులు, జోరుగా వర్షం కురుస్తున్నా గ్రామాల్లో పర్యటించి అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. సహాయక చర్యలు, పునరవాస కేంద్రంలోని వారికి అందిస్తున్న సేవల్లో ఎక్కడా లోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ఫాజిల్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



పెనుగొండ: ఆచంట మండలం పెనుమంచిలిలో వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు



మొగల్తూరు: పంచాయతీ కొత్తకాయలతిప్పలో వరి పనలను ఒబ్బిడి చేస్తున్న రైతులు



పెనుగొండ: ధాన్యాన్ని తరలించడానికి సూచనలు చేస్తున్న అధికారులు

వెదుళ్లపాలెంలో జ్వరాలపై సర్వే

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు సర్వే చేశారు. డెంగీ లక్షణాలతో ఆ ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యుర్రింకి శంకరం మృతి చెందడంతో పాటు మరో నలుగురు రక్తకణాలు సంఖ్య తగ్గిపోయి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఇంటింట సర్వే చేశారు. డెంగీ పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. గ్రామంలో మురుగు డ్రెయిన్ సమస్య కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తెలిపారు. మృతుడి కుటుంబంలో ఏ ఒక్కరికీ డెంగీ లక్షణాలు లేవని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్, హెచ్‌వీ పి ఎలిజబెత్, ఏఎన్ఎం రోజా, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు సర్వే పాల్గొన్నారు.

వరికోతలు మూడు రోజులు వాయిదా వేసుకోవాలి



పాలకొల్లు మండలం వెలివెలలో కోత దశలో ఉన్న పంట చేనును పరిశీలిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతి, జేసీ ఎస్ రామసుందర్‌రెడ్డి

పాలకొల్లు అర్బన్: మిచౌంగ్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులను వరి కోతలను మరో మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి రైతులకు విజ్ఞప్తి చేశారు. పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు, వెలివెల గ్రామాల్లో సోమవారం కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ సుందర్‌రామరెడ్డితో కలిసి పర్యటించి రైతులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యాన్ని నచ్చిన మిల్లుకు తరలించుకునే వెసులబాటు రైతులకు కల్పించిందన్నారు. సొంత వాహనాలకు జీపీఎస్ లేకపోయినా వినియోగించుకునే అవకాశం కల్పించడంతో ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యం సేకరణకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. రెవెన్యూ, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. పంటలకు పొంచి ఉన్న ముప్పు

- వరి పంట రక్షణకు జాగ్రత్తలు తప్పని సరి
- శాస్త్రవేత్త డాక్టర్ టి శ్రీనివాస్





పెనుగొండలో వర్షం నుంచి రక్షణగా ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం
ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి శ్రీనివాస్, వరి పరిశోధన సంస్థ మార్టేరు

పెనుగొండ: రాష్ట్రంలో మించాంగ్ తుఫాన్ హెచ్చరికలతో భారీ వర్షం, ఈదురు గాలులు వీచే అవకాశాలున్నాయన్న తరుణంలో ఆరుగాలాల పాటు కష్టపడి పండించుకున్న వరి పంటను రక్షించుకోవడానికి రైతాంగం తగు జాగ్రత్తలు పాటించి నష్టాలను నివారించుకోవాలంటూ మార్టేరులో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి శ్రీనివాస్ పలు సూచనలు చేశారు.

- కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదు
- కోసిన పూర్తిగా ఆరని పనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలుగా వేసేటపుడు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించవచ్చు.
- పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలి. పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరిగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి, నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించేందుకు క్వింటాలు ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడ ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఆరబెట్టుకొని నిల్వ చేసుకోవాలి
- రంగు మారి, తడిచిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకూ తగ్గించుకోవచ్చు.

వివిధ దశలలో ఉన్నపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

రాష్ట్రంలో గుంటూరు, బాపట్ల వంటి ప్రాంతాల్లో వరి పంట పలు దశల్లో ఉందని, భారీ వర్షాలకు వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి శ్రీనివాస్ వివరించారు.

- నారుమడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నపుడు మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలి. నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవలసిన అవసరం ఏర్పడుతుంది.
- విత్తిన 7నుంచి 30 రోజుల మధ్యలో 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగేతే నారు దెబ్బతినే అవకాశం ఉంది. నారు నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలే విధంగా చేయాలి. నష్ట నివారణకు నీటిని తీసివేసిన అనంతరం 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది.
- అధిక వర్షాలకు నారుమడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి గ్రాము కార్బెండిజం, లేదా రెండు గ్రాముల కార్బెండిజంతో పాటు మాంకోజెట్ మందు మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.
- పంట ఊడిచ్చన వెంటనే, పిలక దశలో ముంపుకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసి పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలి. బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. మొక్క కోలుకొన్న అనంతరం కుళ్లు తెగుళ్ల రాకుండా లీటరు నీటికి గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పొలంలో నిల్చున్న నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేటట్లు బాటలు ఏర్పాటు చేసుకోవాలి.

పశువులకు దొమ్మ నివారణ టీకాలు

యలమంచిలి: తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడంతో పశువులకు దొమ్మ వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డా.తోలేటి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ముఖ్యంగా గోదావరి లంక గ్రామాల్లోనూ, పంటకాలువలు, మురుగు కాలువలు పరివాహక గ్రామాల్లోని పశువులకు కలుషిత నీటి వల్ల దొమ్మ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ గ్రామాల రైతులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి టీకాలు వేసినట్లు ఆయన వివరించారు. తుఫాన్ వల్ల ఏ రైతుకి చెందిన పశువైనా చనిపోతే సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో వీఆర్వో, వలంటీర్, పశువైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని ఆయన తెలిపారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌కే సాధ్యం



పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

పాలకొల్లు అర్బన్: మహాత్మాజ్యోతి రావుపూలే, డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశించిన సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలైందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ స్పష్టం చేశారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజాసంకల్పయాత్రలో మాదిగలకు ఎమ్మెల్సీ ఇస్తానని ఇచ్చిన హామీని సాధారణ కార్యకర్తగా ఉన్న తనకు ఎమ్మెల్సీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఈ నెల 11న అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ప్రాంగణంలో మధ్యాహ్నం 2గంటలకు మాదిగ, మాదిగ ఉపకులాల రాజకీయ ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సభకు ఏ.పీలో ఉన్న మాదిగ కులానికి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఎక్కువగా పాటుపడిన సీఎంగా చరిత్రలో జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని అన్నారు. రానున్న కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా మాదిగ, మాదిగ ఉపకులాల వారు నిలవాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కోరారు. సమావేశంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, మడికి విక్రమ్, న్యాయవాది ముమ్మిడివరపు ఆంజనేయులు, మాముడూరి నాగమణి, ఉండ్రాజవరపు రాజ్‌కుమార్, లంక చిరంజీవి, కనపాల మోహన్, తెన్నేటి చినసామ్యేలు పాల్గొన్నారు.

నేలకొరిగిన పంట చేలు



ఆగర్తిపాలెంలో నేలకొరిగిన పంట చేను

పాలకొల్లు అర్బన్: మిచాంగ్ తుఫాన్ రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. రాపాక ఛానెల్‌కి శివారున ఉన్న పాలకొల్లు మండలంలో నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతకు వస్తుంది. అదే సమయంలో అధిక వర్షాలు, తుపాన్లు, ఈదురు గాలుల కారణంగా రైతులు పంట నష్ట పోతుంటారు. ఈ ఏడాది రైతులను మిచాంగ్ తుఫాన్ రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవడంతో పంట చేలు నేలకొరిగాయి. జిల్లాలోనే అత్యధికంగా పాలకొల్లులో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. ఉదయం 8.30 గంటలకు 49.4 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. సాయంత్రం 5 గంటలకు 85.6 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షం కురిస్తే పంట నష్టం ఎక్కువగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోయాయి.

జాతీయ రహదారిపై కూలిన చెట్టు

పాలకొల్లు – భీమవరం జాతీయ రహదారిలో శివదేవుని చిక్కాల వద్ద చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్తీక సోమవారం కావడంతో పంచారామాలను దర్శించుకునే యాత్రికుల బస్సులు వీరవాసరం నుంచి రాయికుదురు అరట్లకట్ట, లంకలకోడేరు మీదుగా మళ్లించారు. పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించడంతో ట్రాఫిక్ యథావిధిగా కొనసాగింది.

శైవ క్షేత్రాల్లో కార్తీక శోభ



మొగల్తూరు: శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



పాలకొల్లు అర్బన్: శివదేవుని చిక్కాలలో పూజలు చేస్తున్న దృశ్యం

మొగల్తూరు: కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో మండలంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. ఆలయాల వద్ద దీపాలు వెలిగిస్తూ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయం, వడయార్‌పేటలోని స్వయంభూలింగేశ్వర వన మల్లికార్జుని ఆలయం, కాళీపట్నం కాళీశ్వరస్వామి ఆలయం, ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, పేరుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వాయుత్రిలింగ క్షేత్రాల్లో కార్తీక శోభ

పాలకొల్లు అర్బన్: కార్తీక మాసం పురస్కరించుకుని వాయుత్రిలింగ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని పార్వతీ సమేత శివదేవస్వామిని భక్తులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేయించుకున్నారు. సంతాన ప్రాప్తి కోసం దంపతులు స్వామివారి ఆలయంలో అభిషేకాలు చేసి ఆలయ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. మరో వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన దిగమర్రులోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: తన కుమార్తె అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్లలకొడేరుకు చెందిన ఓ వ్యక్తి తన 22 ఏళ్ల కుమార్తె గత నెల 29వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.